# జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీకి 17 నామినేషన్లు

**-ఎంఐఎం-8, కాంగ్రెస్ -7, బిఆర్ఎస్ -2**
**నేడు దరఖాస్తుల పరిశీలన..**
**21వరకు ఉపసంహరణ**
**-ఎన్నికకు బిజెపి దూరం..**
**విత్‌డ్రా అలోచనలో బిఆర్ఎస్**




**హైదరాబాద్,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ గడువు ముగిసింది. ఈఎన్నికలకు మొత్తం 17 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎంఐఎం నుంచి 8, కాంగ్రెస్ నుంచి 7, బిఆర్ఎస్ నుంచి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఫిబ్రవరి 18న (మంగళవారం) స్క్రూటినీ, 21న విత్ డ్రాకు అవకాశం ఉంది. ఫిబ్రవరి 25 న ఎన్నికలు.. ఆరోజే రిజల్ట్స్ వెలువడనున్నాయి. అయితే మకు సపోర్ట్ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ హ్యాండ్ ఇవ్వడంతో బిఆర్ఎస్ నామినేషన్లు విత్ డ్రా చేసుకునే ఆలోచనలో ఉంది. గ్రేటర్ పరిధిలో 150 డివిజన్లు ఉండగా ప్రస్తుతం 146 కార్పొరేటర్లు ఉన్నారు. గత తొమ్మిదేళ్లుగా ఏకగ్రీవంగా ఎన్నిక అవుతుంది స్టాండింగ్ కమిటీ. గతంలో బిఆర్ఎస్ నుంచి 8 ఎంఐఎం నుంచి ఏడుగురు స్టాండింగ్ కమిటీ మెంబెర్స్ ఉండేవారు. పోటీలో 15 మంది కన్నా ఎక్కువ మంది నిలిస్తే ఫిబ్రవరి 25న ఎన్నిక ప్రక్రియను నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామని అధికారులు చెప్పారు.ఒకవేళ పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

నామినేషన్ దాఖలు చేసినవారు. కాంగ్రెస్ నుంచి కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, బూరుగడ్డ పుష్ప నగేష్ , బొంతు శ్రీదేవి, బాణోతు సుజాత, సిఎన్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, బాబా ఫసియుద్దీన్‌లు పోటీచేస్తున్నారు. అలాగే బిఆర్ఎస్ నుంచి ప్రసన్నలక్ష్మీ, జూపల్లి సత్యనారాయణరావులు నామినేషన్ దాఖలు చేయగా ఎంఐఎం నుంచి సయ్యద్ మినాజుద్దీన్, అబ్దుల్ వాహీద్, మహ్మద్ సలీం, ప్రవీణ్‌సుల్తానా, సమీనా బేగం, డా.ఆయోషా హుమ్రా, గౌసుద్దీన్ మమ్మాద్, జబీన్‌లు నామినేషన్ దాఖలు చేశారు. ఇక బీజేపీ కార్పొరేటర్లు తమ సంఖ్య బలం తక్కువగా ఉండటంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. మరోవైపు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా తమ గెలిచే అవకాశం లేకపోవడంతో ఎన్నికలలో పోటీకి వెనక్కి తగ్గే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితిలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ నామి నేషన్లను ఉపసంహరించుకుంటే స్టాండింగ్ కమిటీ లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరగవచ్చని భావిస్తున్నారు.

**స్టాండింగ్ కమిటీ అంటే ఏమిటి..**

గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కోసం ఏనిర్ణయం జరగాలన్నా స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఒక రకంగా స్టాండింగ్ కమిటీ మెంబర్ అంటే కీలక నిర్ణయాల్లో భాగస్వాములయ్యే అవకాశం అన్నమాట. మున్సిపల్ చట్టం ప్రకారం 10 మంది కార్పొరేటర్లకు ఒక స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉంటారు. ఈ లెక్కన 150 మంది కార్పొరేటర్లకు 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నిక అవుతారు.

# జీవితంలో నిలదొక్కుకొనేందుకు పదోతరగతి టర్నింగ్ పాయింట్

**-ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి**
**-గత 5,6 సంవత్సరాల క్వశ్చన్ పేపర్లను తీసుకొని ప్రాక్టీస్ చేయాలి**
**-హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** జీవితంలో ఉన్నత స్థానంలో నిలబడేందుకు పదవ తరగతి పరీక్షలు టర్నింగ్ పాయింట్ అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ నల్లగుట్ట(ఓల్డ్) ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా గ్రీనరీ ఉండేలా చూడాలన్నారు. క్రీడల కోసం పాఠశాల పరిసరాల్లో భూమి చదును చేయాలన్నారు. పాఠశాల కిచెన్ రూమ్‌ను, మధ్యాహ్న భోజనం కోసం వండిన అన్నం, కూర ను పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం పదవ తరగతి క్లాస్ రూమ్‌ని సందర్శించి పిల్లలతో మాట్లాడి పదవ తరగతి పరీక్షలపై అవగాహనా కల్పించారు. పరీక్షలు అంటే భయం వీడి ప్రణాళిక బద్ధంగా చదివి మెరుగైన ఫలితాలుసాధించాలి అన్నారు. గత 5,6 సంవత్సరాల పదవ తరగతి క్వశ్చన్ పేపర్లను తీసుకోని బాగా ప్రాక్టీస్ చేయాలన్నారు. బాగా చదవడంతోపాటు స్లిప్ టెస్టులు రాయాలన్నారు. జీవితంలో నిలదొక్కుకొనేందుకు పదవ తరగతి పరీక్షలు టర్నింగ్ పాయింట్ లాంటిదని అందువల్ల విద్యార్థులు తమ సమయాన్ని పెండ్లిల కోసం, బంధువుల కోసం, పండగల కోసం వృధా చేయకుండా చదువు పైనే ధ్యాస పెట్టాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీధ ర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ గుండప్ప, స్వరూప, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ టెస్ట్ ఇకపై అంత ఈజీ కాదు

**-డ్రైవింగ్ పరీక్షకు ఆటోమేటెడ్ ట్రాక్ -సాఫ్ట్‌వేర్ ఓకే అంటేనే మీకు లైసెన్స్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త** కొందరు డ్రైవింగ్ సరిగా నేర్చుకోకుండానే ఏజెంట్ల ద్వారా అడ్డదారుల్లో లైసెన్సులు పొందుతున్నారు. ఫలితంగా అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలు అనేకం జరుగుతున్నాయి. దీని అంతటికీ ఒకటే కారణం. వాహన డ్రైవింగ్ లైసెన్సుల జారీలో అక్రమాలు చోటు చేసుకోవడమే. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. డ్రైవింగ్ లైసెన్సుల జారీలో అక్రమాలు నిలువరించేందుకు, ప్రమాదాలను అరికట్టేందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్రంలో తొలి దశలో 21 ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఇవి అందుబాటులోకి వచ్చాక డ్రైవింగ్ లైసెన్సుల జారీలో మానవ ప్రమేయం అనేది ఉండదు. పరీక్షకు హాజరైన వ్యక్తికి లైసెన్సు ఇవ్వాలా? వద్దా? అనేది ఆ సాఫ్ట్‌వేరే నిర్ణయిస్తుంది. ప్రస్తుతం మాన్యువల్ విధానంలో డ్రైవింగ్ లైసెన్సులను జారీ చేస్తున్నారు. ఇందులో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లదే కీలక పాత్ర. ఇక ముందు వాటిని ఇచ్చేది టెక్నాలజీనే. అందుకు అనుగుణంగా ఈ ట్రాక్‌లను ప్రభుత్వం సిద్ధం చేయనుంది.పరీక్ష కోసం వచ్చే వాహనదారుల డ్రైవింగ్‌ను పరిశీలించడానికి ఆ ట్రాక్‌లలో కెమెరాలను బిగిస్తారు. నిర్దేశిత సమయంలో పరీక్ష పూర్తయ్యిందా లేదా రెడ్ సిగ్నల్ దగ్గర ఆగారా లేదా దాటేసి వెళ్లారా? ఇలా ప్రతి ప్రక్రియను కెమెరాల ద్వారా చిత్రీకరిస్తారు. ముఖ్యంగా ట్రాక్‌లో వాహనాన్ని సరిగా నడిపారా? గీత దాటారా? తదితరాలను టెక్నాలజీ ఆధారంగా పక్కాగా నమోదు చేయనున్నారు. డ్రైవింగ్ పరీక్షకు దరఖాస్తుదారే హాజరయ్యాడా లేదా ఇతరులు వచ్చారా అనేది కూడా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా గుర్తిస్తారు.

**భూసేకరణ తర్వాత టెండర్లు :** రాష్ట్రంలో తొలిదశలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రాలతో పాటు కొండాపూర్, మేడ్చల్, ఉప్పల్, ఇబ్రహీంపట్నం, మలక్‌పేట, పరిగి, నాగోల్, పెబ్బేరు, జహీరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రవాణా శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, అధికారులతో సమీక్ష నిర్వహించి ఈ విషయంపై చర్చించారు. ఈ ప్రాంతాల్లో వచ్చే ఫలితాల ప్రకారం మిగిలిన ప్రాంతాలకు విస్తరించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఒక్కో ట్రాక్‌కు 3 నుంచి 4 ఎకరాల భూమి అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ విధంగా భూసేకరణ జరిపి త్వరలోనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నట్లు సమాచారం.

# హైడ్రా ప్రజావాణికి 64 ఫిర్యాదులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త** హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 64 ఫిర్యాదులు వచ్చాయి.తమ కాలనీలకు వెళ్లేందుకు వీలు లేకుండా కొంతమంది కాలనీ వాసులు చుట్టూ ప్రహరీలు నిర్మించుకుంటున్నారని, నాలాలు కబ్జా చేసి వరదనీరు వెళ్లడానికి వీలు లేకుండా చేస్తున్నారని ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులందాయి.రహదారులకు అడ్డంగా నిర్మాణాలు, ప్రహరీలు నిర్మించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన వాటిని ప్రాధాన్యాంశాలుగా పరిగణించాలని హైడ్రా అధికారులకు కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ప్రహరీ నిర్మించడానికి అనుమతులున్నాయా లేదా అనేది చూసి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. రహదారులన్నీ అందరూ వినియోగించుకునేలా చూడాలని, ఎవరికీ ఆటంకాలు కలిగించకుండా చేయాలన్నారు.ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్లో గూగుల్ మ్యాప్స్ ద్వరా ఫిర్యాదుదారులతో చర్చించి తగిన చర్యలను అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అలాగే అక్కడికక్కడే అధికారులకు ఫిర్యాదుదారులకు పరిచయం చేసి..వారితో ఫాలోఅప్ చేయండని సూచించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని కాచవని సింగారం గ్రామంలోని సర్వే నంబరు 54లో ఉన్న లేఔట్‌లోని భాగ్యనగర్ నందనవనం పార్కును కబ్జా చేశారంటూ ఫిర్యాదు. 1977లో 340 ప్లాట్లతో లేఔట్ వేయగా 2007లో 110 ప్లాట్లతో గ్రామపంచాయతీ లే ఔట్‌గా తీర్మానం జరిగింది. ఇదే లే ఔట్‌ను 2006లో కొన్నట్టు చూపించి 2010 లో హెచ్ ఎండీఏ అనుమతి కోసం కబ్జాదారులు దరఖాస్తు చేసుకున్నారు. హెచ్‌ఎండీఏ అనుమతి మంజూరు చేయకపోయినా.. దివ్యనగర్ ప్లాట్ ఓనర్ల సంక్షేమ సంఘం ఆ ప్లాట్లను అమ్ముకున్నారని అందులో పార్కు స్థలం కూడా ఉందని పలువురు ఫిర్యాదు చేశారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం, తుర్కయాంజల్ మున్సిపాలిటీలోని దేవరయాంజల్ గ్రామంలోని సర్వే నంబరు 452, 453లో 3.39 ఎకరాలలో లేఔట్ వేసి ప్రహరీ నిర్మించడంతో తమకు దారి లేకుండా పోయిందని ఆ ప్రాంత నివాసితులు ఫిర్యాదు చేశారు.జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌లోని రాక్‌గార్డెన్స్ పేరిట లే ఔట్‌లో పేర్కొని ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్ పేరిట వ్యాపారం చేస్తున్నారని స్థానికుడు ఫిర్యాదు చేశారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మున్సిపాలిటీలోని కుషాయిగూడ విలేజ్‌లో సర్వే నంబరు 177లో ఉన్న పార్కు స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా అమ్మేశారని ఆ పార్కు స్థలాన్ని పక్కన ఉన్న తమ లే ఔట్‌లో చూపిస్తున్నారని పలువురు వాపోయారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా అక్కడ కల్లు కాంపౌండ్ ఏర్పాటు చేశారంటూ పేర్కొన్నారు.



# హైదరాబాద్ వార్త

# ఎవరి పనులకు వారిదే బాధ్యత...



ఫిర్యాదులపై టౌన్‌ప్లానింగ్ అధికారులను నిలదీస్తున్న కమిషనర్ ఇలంబర్తి

**-టౌన్‌ప్లానింగ్ విభాగంపై కమిషనర్ ఇలంబర్తి సీరియస్**
**-అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులను పరిష్కరించకపోవడంతో ఆగ్రహం**
**-వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించరాదని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమీషనర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ...టౌన్ ప్లానింగ్ నకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై సర్కిళ్లలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారహితంగా ప్రవర్తించడం సరికాదని, ఎవరి పనులు వారు బాధ్యతగా చేయాలన్నారు. నిబంధనల మేరకు అధికారులు పనిచేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు స్పీకింగ్ ఆర్డర్స్ జారీ అయిన తర్వాత వెంటనే అనుసరించాల్సిన తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. “నిబంధనల మేరకు అక్రమ నిర్మాణాలు తొలగించడంలో వెనకడుగు వేయరాదని ఆయన స్పష్టం చేసారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 57 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 25, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్, ఫైనాన్స్ విభాగాలకు 3 చొప్పున, యు.బి.డి. ల్యాండ్ అక్విజేషన్ విభాగాలకు 2 చొప్పున, శానిటేషన్, యు.సి.డి, ఎలక్ట్రికల్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 6 ఫిర్యాదులు అందాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు,సీపీపి శ్రీనివాస్, గీతా రాధిక, పంకజ, సుభద్ర దేవి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు సిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పద్మజ , యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, అడిషనల్ సి.సి.పి గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, డిప్యూటీ సీఈ పనసారెడ్డి, హౌసింగ్ ఈ ఈ లు పీవీ రమణ, రాజేశ్వర్ రావు. వాటర్ వర్క్స్ సాయి రమణ పాల్గొన్నారు.

## గ్రేటర్‌లో రూ.150 కోట్లతో సుందరీకరణ పనులు

**-హైదరాబాద్ ఇమేజ్ పెంచడమే లక్ష్యం**



**పంజగుట్ట, ఫిబ్రవరి 17 (ప్రభాతవార్త):** హైదరాబాద్ ఇమేజ్ ను దేశవ్యాప్తంగా పెంచేందుకు నగర వ్యాప్తంగా 150 కోట్లతో సుందరీకరణ పనులను చేపట్టి నట్లు మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి అన్నారు.సోమవారం సాయత్రం రోడ్డు నంబర్ 45, షేక్ పెట్ నాల జంక్షన్ వద్ద మొత్తం ,49 లక్షల వ్యయం తో చేపట్టిన సుందరీకరణ పనుల మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి లాంఛనంగా ప్రారంభించారుఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి పర్యటక రంగంలో అంతర్జాతీయ నగరంగా గుర్తింపు ఉన్న నేపథ్యంలో ప్రజా పాలన ప్రభుత్వం హైదరాబాద్ ఇమేజ్ ను మరింత పెంచాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తో నగర వ్యాప్తంగా 150 కోట్ల అంచనా వ్యయం తో 106 ప్రదేశాలలో పనులను చేపట్టేందుకు లక్ష్యం కాగాఇప్పటి వరకు 78 పనులను పూర్తి చేసినట్లు మేయర్ పేర్కొన్నారు. మిగితా పనికి వివిధ ప్రగతి దశలో ఉన్నాయన్నారు.షేక్ పెట్ నాల వద్ద 24 లక్షల రూపాయల వ్యయం తో చేపట్టగా ,జూబ్లి హిల్స్ రోడ్డు నంబర్ 45 వద్ద చేపట్టిన సుందరి కరణ పనులకు ..25 లక్షల వ్యయం తో చేపట్టారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ అనురాగ్ జయంత్, డి సి ప్రశాంతి, యస్ ఈ రత్నాకర్, ఈ ఈ విజయకుమార్, షేక్ పెట్ కార్పొరేటర్ పారస్ యు బి డి జోనల్ హార్టికల్చర్ అధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నుమాయిష్

**గన్‌ఫౌండ్రి,ఫిబ్రవరి 17ప్రభాతవార్త:** విద్యుత్ కాంతుల వెలుగు జిలుగులు....కళ్లు చెదిరే ఇంటీరియర్ డెకరేషన్...భారీ పరిశ్రమలుమొదలు కొనికుటీర పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తుల ప్రదర్శన.ప్రత్యేక ఆకర్షణగా నిలిచే హస్తకళా రూపాలు..అలరించే చుక్‌చుక్ రైలు.గాలిలో తేలిపోయే అనుభూతిని కలిగించే రంగులరాట్నం..నోరూరించే తిను బండారాలు.... తదితర అన్ని హంగులతో నడుస్తున్న ‘ననుమాయిష్’ సోమవారంతో ముగిసింది.జనవరి 3వ తేదిన ప్రారంభించిన నుమాయిష్ ఫిబ్రవరి 17వ తేది అర్ధరాత్రి ముగిసింది.దాదాపుగా20లక్షల మంది సందర్శకులు 84వ ఎగ్జిబిషన్ నుమాయిష్‌ను సందర్శించారు.ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటనరీ హాల్‌లో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లోని వివిధ వస్తువులు ఎంతో ఆకట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈసందర్భంగా ఉత్తమ స్టాల్స్ నుఎంపిక చేసిన వారిని బహుమతులు అందచేశారు. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా విభాగాలకు చెందిన జర్నలిస్టులను సన్మానించారు. ఈకార్యక్రమంలో సొసైటి కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి,ఉపాధ్యక్షులు నిరంజన్,సంయుక్త కార్యదర్శిడి.మోహన్,కోశాధికారి ప్రభాశంకర్‌లతోపాటు వివిధ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.ట్రాఫిక్,లాఅండ్ ఆర్డర్ పోలీసులు బందో బస్తు నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యకి మృతి..

**పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు కొంపల్లి బ్రిడ్జిపైన డీసీఎం వెహికల్ ఎక్కుతుండగా సుచిత్ర నుండి మేడ్చల్ వెళ్ళే గుర్తు తెలియని కారు అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి డీసీఎం ఎడమ వైపు వెళుతూ ముగ్గురు వ్యక్తులను ఢీకొట్టింది. ఎం.రామకృష్ణ (35)కు తలకు తీవ్ర గాయాలు అవడంతో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్‌లో జాయిన్ చేయగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు వైద్యులు తెలియజేశారు. అతని స్నేహితులు తపస్ గురియా (34), గురువస్ దాస్ (20) ఇద్దరికి గాయాలయ్యాయి. వీరు ముగ్గురు పేట్ బషీరాబాద్‌లోని క్రియేషన్ డెకరేషన్‌లో సుమారు సవత్సరం నుండి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## నగరంలో మరో సారి డ్రగ్స్ పార్టీ కలకలం

**పంజగుట్ట, ఫిబ్రవరి 17 (పభాతవార్త):** హైదరాబాద్‌లో మరో సారి డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. పోలీసులు ఎన్నిసార్లు దాడులు చేసినా జూబ్లీహిల్స్,ఫిలింనగర్ ప్రాంతాలలోని పబ్‌లలో మాదకద్రవ్యాల సేవనం ఆగడం లేదు. స్థానిక పోలీసుల హెచ్చరికలను ఆయా పబ్‌ల యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి. ముఖ్యంగా వీకెండ్స్ లో పబ్‌లో డ్రగ్స్ సేవించేవారు ఎక్కువైపోయారని ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. సంబంధత అధికారులు రైడ్స్ చేసినపుడు గుట్టుచప్పుడు కాకుండా యాజమాన్యాలు గుంభనంగా వ్యాపారం సాగిస్తుండడంతో పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడడం లేదు. కానీ వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతూనే ఉంది. తాజాగా ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లోని ఆలివ్ బిస్ట్రో పబ్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతుందనే పక్కా సమాచారంతో అర్ధరాత్రి పబ్‌లో పోలీసుల తనిఖీలు నిర్వహించారు. .20 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ఆ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో ముఖ్యంగా పబ్‌లలో డ్రగ్స్ అరికట్టడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఎన్నిచోట్ల దాడులు చేసినా ఎక్కడో ఒకచోట డ్రగ్స్ పార్టీలు జరుగుతూనే ఉన్నాయి.

## మీ ఆవిడని నాకిచ్చేయ్..

**-మద్యం మత్తులో ప్రియురాలిని ఇచ్చేయాలంటూ భర్తతో ఘర్షణ**
**-ఇంట్లో నుంచి గెంటివేయడంతో ఆత్మహత్య**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త** మధురానగర్లో ఓ ప్రియుడు ప్రియురాలి ఇంటి ముందు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..నగరంలోని యాదగిరినగర్‌లో వైజాగ్‌కి చెందిన భార్య భర్తలు నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ జూనియర్ ఆర్టిస్టులుగా పని చేస్తున్నారు. అయితే.. ఆ మహిళకు విశాఖకు చెందిన లారీ డ్రైవర్ సూర్యనారాయణ ఆరేళ్ళ క్రితం పరిచయం ఉంది. ఆ పరిచయం కాస్త పెరగడంతో ఐదు రోజులు క్రితం సూర్యనారాయణ సదరు మహిళ ఇంటికి వచ్చి వాళ్ల ఇంట్లోనే ఉన్నాడు. అంతేకాకుండా.. తన భార్య, కొడుకు, కూతురు తనను పట్టించుకోవడం లేదంటూ వారితో చెప్పుకున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి సూర్యనారాయణ ప్రియురాలి ఇంటికి వచ్చాడు. ఆమె భర్త ముందే ’నీ పెళ్లాంని నాకిచ్చేయ్.. బాగా చూసుకుంటాను’ అని అన్నాడు. దీంతో.. ప్రియురాలి భర్త, సూర్యనారాయణకు మధ్య గొడవ జరిగింది. ఇంటి నుంచి ప్రియురాలి భర్త సూర్యనారాయణను గెంటేశాడు. అయినప్పటికీ ఆ రాత్రంతా సూర్యనారాయణ ప్రియురాలి ఇంటి ముందే ఉన్నాడు. తెల్లవారుజామున యూసుఫ్‌గూడలోని పెట్రోల్ బంకుకు వెళ్లి పెట్రోల్ కొనుక్కొని వచ్చి ప్రియురాలి ఇంటి ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు, అంబులెన్సు సమాచారం అందించారు. దీంతో వెంటనే సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు.. తీవ్రంగా గాయపడ్డ సూర్యనారాయణను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## అనారోగ్య సమస్యలతో ఉరివేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య...

**బేగంపేట ఫిభ్రవరి 17,ప్రభాతవార్త** మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ ఉరివేసుకుని ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నమోదైంది.ఈ ఘటనపై మహంకాళీ పోలీసుల కధనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సికింద్రాబాద్ కళాసీగూడా కామాక్షి ఆలయం వద్ద గాజుల రంగనాథ్‌రావు,గాజుల దాక్షాయణి లు నివాసం ఉంటున్నారు.గాజుల రంగనాథ్‌రావు (36)పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు.అతను 2014బ్యాచ్‌కు చెందిన వాడు.వీరికి 16నెలల వయసున్న వేదాంష్ కార్తికేయ అనే బిడ్డ జన్మించాడు.2022 నుంచి తన భర్త గాజుల రంగనాథ్‌రావు అనారోగ్యంతో బాధపడుతున్నాడన్నారు.2023లో శస్త్ర చికిత్స చేయించుకున్నాడన్నారు.అయితే ఈ నెల 16వ తేదీన మందులు కూడా వేసుకున్నాడన్నాడు.అదే రోజు గం 11.15నిలకు ఇంటి నుంచి బయలు దేరి బోయిన్ పల్లిలోని తన తల్లి ఇంటికి గం 11.35నిలకు చేరుకున్నాడన్నారు.ఆ తరువాత తన భర్తకు దాక్షాయణి తన ఫోన్ నుంచి వీడియో కాల్ చేసినా రంగనాథ్ ఎత్తలేదన్నారు.దీంతో గం 7.50నిలకు బైక్‌పై ఆమె అత్తగారింటికి వెళ్లిందన్నారు.రెండవ అంతస్తులో ఉన్న వారి గదికి వెళ్లి ప్రధాన ద్వారం తెరచి బెడ్‌రూంలోకి వెళ్లి చూడగా రంగనాథ్ నీలం రంగు చెక్స్ లుంగీతో వెంటీలేటర్ గ్రిల్‌కు వేలాడుతూ కనిపించాడన్నారు.ఆమె పెద్దగా అరిచి ఆమె మామకు ఫోన్ చేసిందన్నారు.వారు వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి డయల్ 100ద్వారా మహంకాళీ పోలీసులకు సమాచారం అందించారన్నారు.వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్ సిబ్బంది అతన్ని పరిక్షించగా అప్పటికే అతను మృతి చెందినట్లు ప్రకటించారన్నారు.ఈ సంఘటనపై దాక్షాయణి ఫిర్యాదు మేరకు ఎస్సై కె.సుబ్రమణియం కేసు నమోదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ కె.పరుశురాం తెలియజేసారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి ముఖ్యమంత్రి సహకారం

### -ఎమ్మెల్యే శ్రీగణేష్



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం 6వ వార్డు, టెంపుల్ రాక్ ఎన్‌క్లేవ్ కాలనీలో 37.6 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఈ ప్రాంతానికి ఎంపీగా పని చేసినందు వల్ల ఆయనకు నియోజకవర్గం పై అవగాహన ఉందని, అందుకే నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారన్నారు. తను అన్ని శాఖల మంత్రులతో సమన్వయం చేసుకుంటూ నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం సేకరిస్తున్న రక్షణ శాఖ భూములకు ప్రత్యామ్నాయంగా ఇస్తున్న 303 కోట్ల రూపాయలను కూడా సెంట్రల్ పూల్ కి కాకుండా కంటోన్మెంట్ కి కేటాయించేలా ముఖ్యమంత్రి రక్షణ శాఖతో మాట్లాడారన్నారు. ఎన్నికల సమయంలో పార్టీలో ఆరోపణలు చేసుకున్నా ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ మురుగేషన్, రాష్ట్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతాం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు,వైస్ చైర్మన్ దేవుడు తదితరులు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంపై,అభివృద్ధిపై నిరంతరం పోరాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్‌పై అనుచిత వాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని బోయిన్‌పల్లి మాజీ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్, డి.బి. దేవేందర్ దేవుడులు హెచ్చరించారు. సోమవారం పికెట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ పదవిని కాపాడుకునేందుకు బోర్డు మెంబర్ రామకృష్ణ, ఎమ్మెల్యే శ్రీగణేష్‌పై అనుచిత వాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కేంద్రం ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన 700 కోట్ల రూపాయలను తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొలుకుల జగన్

**జగద్గిరిగుట్టు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ లో 60 లక్షల రూపాయలతో ప్రధాన రహదారి రోడ్డును సోమవారం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడం జరిగింది. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు జైహింద్, వెంకట్ రెడ్డి, బుచ్చిరెడ్డి, దత్తాత్రేయ, అంజయ్య నగర్ సొసైటీ అధ్యక్షులు శంకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు విట్టల్ ముదిరాజ్, మహేందర్ రెడ్డి, నాగరాజు, నాని, జై క్రిష్ణ, యాదగిరి, మనోజ్, రాజు, సాయిలు, ఆజం, ఖలీల్, ముంతాజ్ అలి, సంతోష్, ప్రభాకర్ విఘ్నేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన నాయకులు



పాలాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

**నిజాంపేట్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

బీసీ కులఘనన, ఎస్సీ వర్గీకరణ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ కృతజ్ఞతగా సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి సిగ్నల్ పరిధిలో నాయకులు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొలన్ వీరేందర్ రెడ్డి, జగదీష్ యాదవ్, సురేష్ రెడ్డి, చిట్ల దివాకర్, శ్రీశైలం యాదవ్, వీరబాబు, జీవన్ యాదవ్, జగన్, టేకుల ప్రవీణ్ రెడ్డి, రవి గౌడ్, సత్తి రెడ్డి, మధు రెడ్డి, రాజేందర్,అలాటి శ్రీను, శంకర్, నారాయణ. కె, నవీన్, ఎమ్. రమేష్, జీతయ్య, శ్రీ రామ్ రెడ్డి, ప్రవీణ్(లడ్డు ), మల్లిఖార్జున్, రామ్ చందర్ నాయక్, హరియ నాయక్, మహేష్, నవ్య, కోటేశ్వరి, పంగ శ్రీను, మోలశ్వర్ రావు, పితాని శ్రీనివాస్, టి. వీరేష్, సత్య ప్రసాద్, ప్రేమ్, జనార్దన్ రెడ్డి, విజయ్ కుమార్, రఘు, అశోక్, యశోద, మహిపాల్, ప్రశాంత్ రెడ్డి, శ్రీధవి, కరుణ, హరి బాబు, ఆదిరెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

-బహదూర్‌పుర జోన్ ఉప విద్యాశాఖాధికారి బోమ్య నాయక్



బహదూర్‌పుర జోన్ ఉప విద్యాశాఖాధికారి బోమ్య నాయక్ దారుషిఫా ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించినప్పటి చిత్రం

**చార్మినార్,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలో వంత శాతం ఉత్తీర్ణత సాధించాలని,మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని బహదూర్‌పుర జోన్ ఉప విద్యాశాఖాధికారి బోమ్య నాయక్ అన్నారు. బహదూర్‌పుర జోన్ పరిధిలో ఉన్న దారుషిఫా ప్రభుత్వ హైస్కూల్,ప్రభుత్వ దారుషిఫా అంధుల పాఠశాలను ఆయన సందర్శించారు.పదో తరగతి ప్రాక్టీస్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులను ఆయన కలిశారు.ఈ సందర్భంగా బహదూర్‌పుర జోన్ ఉప విద్యాశాఖాధికారి బోమ్య నాయక్ మాట్లాడుతూ బహదూర్‌పుర జోన్ పరిధిలోని 27 ప్రభుత్వ హైస్కూళ్లలో 1057 మంది విద్యార్థులు మార్చి నెలలో జరగనున్న వార్షిక పరీక్షలకు హాజరు కానున్నరని తెలిపారు.పదో తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమని,నెల రోజుల పాటు కష్ట పడి చదివితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలియజేశారు.విద్యార్థులు మంచి క్రమ శిక్షణతో పాటు సమయాన్ని వృధాచేయకుండ కష్టపడి చదవాలని ఆయన కోరారు.బహదూర్‌పుర జోన్ పరిధిలోని ప్రభుత్వ హైస్కూళ్లలో చదువుచున్న పదో తరగతి విద్యార్థులకు ప్రతీ రోజు ఉదయం,సాయంత్రం వేళల్లో గంట పాటు ప్రత్యేక తగరతులు నిర్వహిస్తున్నామని,విద్యార్థులకు సాయంత్రం వేళ అల్పాహారం కూడ ప్రభుత్వం అందిస్తున్నదని ఆయన తెలియజేశారు.ప్రభుత్వ హైస్కూళ్లలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని,గత సంవత్సరం డిసెంబరు నెల 31వ తేదీ నాటికి పదో తరగతి సిలబస్ పూర్తి చేయటం జరిగిందని,పదో తరగతి పరీక్షలలో గత ఏడాది 78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు.

### జక్కుల మహేశ్వర్ రెడ్డిని అభినందించిన కెటిఆర్



స్పర్శ క్యాన్సర్ పౌండేషన్‌కు రూ.3 లక్షల చెక్కులను అందజేస్తున్న జక్కుల మహేశ్వర్ రెడ్డి, కేటీఆర్,హరీశ్ రావ్ తదితరులు

**అడ్డగుట్ట,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** మాజీ ముఖ్య మంత్రి కేసిఆర్ జన్మదినాన్ని పురసనర్కరించుకొని సామాజిక నసేవా కార్యక్రమాల్లో భాగంగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అధ్వర్యంలో స్పర్శ క్యాన్సర్ పౌండేషన్‌కు రూ.3 లక్షల చెక్కును బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, మాజీ మంత్రి హరిశ్‌రావ్, మాజీ స్పీకర్ మధుసూదన చారిల సమక్షంలో అందజేశారు.

### ప్రభుత్వ భూమి కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు

**నిజాంపేట్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వే నెంబర్ -87, 90,95,103,191,223, అలాగే బాచుపల్లి సర్వే 186, 292లోని ప్రభుత్వ భూమి కాపాడాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యక్రమంలో సోమవారం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలో జరుగుతున్న ప్రభుత్వ భూమి కబ్జాల గురించి అనేక సార్లు పిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడంలేదన్నారు. బాచుపల్లి మండల పరిధిలోని సర్వే నెంబర్ ఒకటి ఉంటే (పోజుషన్) అంటే స్థలంలో ఒక్కరు వుంటారని తెలిపారు. మున్సిపల్ అధికారులు డాక్యుమెంట్స్ చూస్తారు కానీ స్థలం చూడారని, రెవెన్యూ అధికారులు స్థలం చూస్తారు కానీ కబ్జాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోరన్నారు. వెంటనే ఆ కబ్జాలను ఆపాలని లేనిపక్షంలో ఆ ప్రభుత్వ భూమిని పేద ప్రజలు ఆక్రమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమనికి సీపీఐ నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడారంగంలో రాణించాలి

-అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

**దుండిగల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** యువత క్రీడారంగంపై ఆసక్తి చూపాలని అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్, ఎమ్మెల్లార్ గ్రూప్ అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి పేర్కొన్నారు. దుండిగల్ పరిధి ఎమ్మెల్లార్ మైదానంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న దుండిగల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ముగిసాయి. 10జట్లు పాల్గొన్న ఈపోటీలలో వైల్డ్ ఈగల్ టీమ్ కప్ కైవసం చేసుకోగా శ్రీక్రిష్ణసేన టీమ్ రన్నరప్‌గా నిలిచింది. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి లక్ష్మణ్‌రెడ్డి అతిథిగా విచ్చేసి విజేతకు రూ,10వేలు, రన్నరప్‌కు రూ,6వేలు నగదు బహుమతితో పాటు కప్పులను ప్రధానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుండిగల్‌కు చెందిన యువకులు స్వచ్ఛందంగా క్రీడా పోటీలను నిర్వహిస్తుండడం సంతోషకరం అన్నారు. చెడు దారులు తొక్కుతున్న యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు తమకు నచ్చిన క్రీడరంగంలో రాణించాలని, ప్రతిభ గల క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కావలి గణేష్, మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, పాక్స్ డైరెక్టర్ నల్తూరి క్రిష్ణ, నాయకులు జక్కుల శ్రీనివాస్, ఆకుల ప్రేమ్‌కుమార్, దొంతి మహేశ్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### మల్లికార్జునస్వామి ఆశీస్సులతో అందరూ బాగుండాలి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటి సభ్యులు

**దుండిగల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్‌లోని శ్రీమల్లికార్జునస్వామి జాతర కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీమల్లికార్జునస్వామి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని అభిలషించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణయాదవ్, విజయశ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ రవీందర్‌యాదవ్, నాయకులు మురళియాదవ్, నాగరాజుయాదవ్, ఆలయ కమిటి సభ్యులు జక్కుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ప్రభుత్వ సిటీ కళాశాల మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారం

**చార్మినార్,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** సుప్రసిద్ధ సాహితీవేత్త,ప్రముఖ అనువాదకులు, పరిశోధకులు, కవి,బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌ను ప్రభుత్వ సిటీ కళాశాల మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నలిమెల భాస్కర్ వివిధ సాహిత్య ప్రక్రియాల్లో 25 పైగా గ్రంధాలు వెలువరించారని,కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో పాటు పలు పురస్కారాలు డాక్టర్ భ్కార్ అందుకున్నారని ఆయన తెలియజేశారు.

### ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం: కార్పొరేటర్



కాలనీ వాసులుతో కార్పొరేటర్

**అల్వాల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధిని కొనసాగిస్తున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని రాక్‌ల్యాండ్ ఎవెన్యూ కాలనీలో అధికారులుతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. పారిశుధ్యం, వీధి దీపాలు, మంచినీటి పైపులైన్లులకు సంబంధించిన సమస్యలను కాలనీ వాసులు వివరించారు. సమస్యలు అన్నింటికి త్వరలోనే పరిష్కారం లభిస్తుందని జితేందర్‌నాథ్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం శాంభయ్య స్థానికులు జగన్ మోహన్ రావు, శ్రీశైలం, మాధవ్‌రావు, ప్రసాద్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### డబుల్ ఇండ్లకు బస్సు సర్వీస్ ప్రారంభించిన ఎమ్మెల్యే



బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

**దుండిగల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక పరిధి దుండిగల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయం నుండి సికింద్రాబాద్‌కు వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసి బస్సు సర్వీస్‌ను సోమవారం ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఆకాంక్షతో కేసిఆర్ ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తూ డబుల్ ఇండ్ల నిర్మాణం చేసిందన్నారు. అయితే ఇక్కడి నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళడానికి ఇబ్బందులు పడకుండా ఆర్టీసి బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణయాదవ్, విజయశ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ రవీందర్‌యాదవ్, నాయకులు మురళియాదవ్, నాగరాజుయాదవ్ తదితరులతో పాటు లబ్దిదారులు పాల్గొన్నారు.

## ప్రాధమిక దశలోనే అంధత్వ సమస్యలు గుర్తించాలి

### -ప్రొఫెసర్ రవి శేఖరరావు



గాంధీ ఆస్పత్రిలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ప్రాధమికదశలోనే అంధత్వ సమస్యలు గుర్తించి సరైన వైద్యం అందిస్తే నివారణ, నియంత్రణ సులభమవుతుందని గాంధీ అప్తమాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రవి శేఖరరావు అన్నారు. చిన్నారి విద్యార్థుల్లో అంధత్వ సమస్యలు, రుగ్మతలను గుర్తించేందుకు నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా గాంధీఆస్పత్రి ఆప్తమాలజీ విభాగంలో సీతాఫల్‌మండి, లాలాపేట, అంబర్‌పేట ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు సోమవారం వివిధ రకాల కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవిశేఖరరావు మాట్లాడుతు కంటిచూపు, రెటీనా, కనుపాప, మెల్లకన్ను, కంటినరాలకు సంబంధించిన పలు వైద్యపరీక్షలు నిర్వహించి, తగిన మందులు, కళ్లద్దాలు అందించామన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన పలు పాఠశాలలకు చెందిన 2వేల మందికి వైద్యపరీక్షలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని, ఈ శిబిరం మార్చి 7వతేది వరకు కొనసాగుతుందని వివరించారు. గాంధీ అప్తమాలజీ వైద్యులు సుజనీ, ప్రావీణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో ఫ్లెక్సీ వార్

-తమ ఫ్లెక్సీలను తొలగించారంటూ బిఆర్ఎస్ ఆందోళన



ఆందోళన నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో సోమవారం బిఆర్ఎస్ నేతలు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ , బ్యానర్లను తొలగించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్రాస్‌రోడ్స్‌లో కొద్దిసేపు బైఠాయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్దపెటున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి దేశంలోనే అగ్ర బాగాన నిలబెట్టిన కేసీఆర్ జన్మదిన సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రజా పాలన విడిచి బిఆర్ఎస్ పార్టీని అణిచివేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా తమ పార్టీ ఇంకా బలోపేతం అవుతుందని, ఇతర పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు ఉన్నప్పటికీ కేవలం తమ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు తొలగించారని మండిపడ్డారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మధ్యరాత్రి నుంచి సిబ్బంది ద్వారా ఫ్లెక్సీలను తొలగింపచేశారన్నారు. రేవంత్ సర్కార్ కేవలం బి.ఆర్ సంబంధించిన ఫ్లెక్సీలు మాత్రమే తొలగించారని, కాంగ్రెస్ పార్టీల ఫ్లెక్సీలు యధావిధిగా ఉన్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమం అనంతరం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్, రాంనగర్, భోలక్పూర్,అడిక్మెట్, కవాడిగూడ , ముషీరాబాద్ పార్టీ డివిజన్లో అధ్యక్షులు రాకేష్ కుమార్,శంకర్ ముదిరాజ్, వై శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్ యాదవ్, శ్రీధర్ రెడ్డి. నాయకులు శివ ముదిరాజ్, పాశం రవి, పున్న సత్యనారాయణ, నవీన్, రవిశంకర్ గుప్త, దీన్ దయాల్ రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, వెంకటేష్, గోరక్,, ముఠా శివ సింహ, పద్మ, లక్ష్మి,అరుణ శ్రీ, దేవయ్య, జహంగీర్, హనుమంత్ , వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ ఆటో విరాళం





వాహనాన్ని అందజేస్తున్న దృశ్యం

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** గాంధీ ఆస్పత్రిలోని రోగి సహాయకుల విశ్రాంతి కేంద్రంలో ఉచిత భోజనం సమకూర్చడానికి ఆహార సరఫరా కోసం జనహిత సేవా ట్రస్ట్‌కు బ్యాంక్ ఆఫ్ బరోడా సీఎస్ఆర్‌లో భాగంగా రూ.ఐదు లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన మూడు చక్రాల ఎలక్ట్రిక్ ఆటో వ్యాన్ విరాళంగా అందజేశారు.బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేష్ కుమార్, హైదరాబాదు జోన్ డిజీఎం సుధాకర్, మెట్రో రీజియన్ డిజీఎం కే. ఆదిత్యలు సోమవారం జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీలు నర్సింహ మూర్తి, పాలపర్తి రమేష్‌లకు వ్యాన్ తాళాలను అందజేశారు. గాంధీ ఆస్పత్రి లో రోగి సహాయకులకు ఉచిత భోజనం సమకూర్చడానికి రూ.55 వేల చెక్కును అందజేశారు.

### స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలంటూ సంతకాల సేకరణ



ఫొటోరైటప్ః మోతీనగర్ చౌరస్తాలో పశువుల సంత స్థలంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలంటూ సంతకాల సేకరణ చేస్తున్న గోపాల్‌రెడ్డి.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మోతీనగర్ ప్రాంతంలోని బబ్బుగూడ గ్రామం గ్లాస్ ఫ్యాక్టరీని ఆనుకుని ఉన్న పశువుల సంతను తరలించి ఆ స్థలంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలంటూ పార్టీలకు అతీతంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. స్థానికంగా ఉన్న సీనియర్ నాయకులు కె.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మోతీనగర్ ప్రాంతంలో వివిధ బస్తీలకు కాలనీలకు చెందిన ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి సంతకాల సేకరణ చేపట్టారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో పశువుల సంతను నిర్వహిస్తున్నారు. దాన్ని ప్రభుత్వం అక్కడి నుంచి తరలించే యోచనలో ఉండగా ఆస్థలాన్ని ప్రజా ఉపయోగాల కోసం స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని స్టేడియం నిర్మించే వరకు ఈ సంతకాల సేకరణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, జబ్బర్, మహ్మద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**దుండిగల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** విద్యుత్ ఫీడర్ల మెయింటనెన్స్‌లో భాగంగా ఎన్‌రిచ్ బొల్లారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11కెవి బాలాజీ ఎన్‌క్లేవ్, మల్లంపేట, వెంకటప్రణీత్ ఫీడర్ల పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్, కాజీపల్లి రోడ్, ప్రణీత్‌జెమ్స్, ఆంధ్రా బ్యాంక్ వెనుకాల, మల్లంపేట గ్రామం, డ్రీమ్‌వ్యాలీకాలనీ, గ్రీన్‌పార్క్‌కాలనీ, ఎపిఆర్‌విల్లాస్, జిఎల్‌సి విల్లాస్, హైరైజ్ విల్లాస్, వెంకటప్రణీత్ లీఫ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంల నుండి సాయంత్రం 5గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా



ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గం ఎన్నికైన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్.ఎల్.పద్మ, వి.ప్రవీణ్ ఎన్నికయ్యారు. సోమవారం విద్యానగర్లోని మార్క్స్ భవన్‌లో టియుసిఐ ఆధ్వర్యంలో ప్రధమ మహాసభ జరిగింది. మహాసభ భవిష్యత్ కార్మిక ఉద్యమానికి హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఎల్ పద్మ, ,వి ప్రవీణ్ , ఉపాధ్యక్షులుగా లింగం గౌడ్, కే నల్లన్న, సహాయ కార్యదర్శులుగా ఎస్ శ్రీనివాస్, కే.ఎస్.ప్రదీప్, కోశాధికారిగా డి లక్ష్మిలతోపాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు ఎం. హన్మేశ్,ఎస్. రవీందర్, ప్రభాకర్, అఫ్జల్ , టి.నారాయణ,ఖాజామియా, మెహర్ ,శివరంజని, సత్యనారాయణ విష్ణు విజయ్ కుమార్ శ్రీనివాస్ జే.వెంకటేష్ జోగినాథ్ తదితరులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలను ఆమోదించారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ లు రద్దు చేయాలని, రాష్ట్రంలో కేంద్రంలో కార్మికులకు కనీస వేతనాలను నేటి పరిస్థితులు కనుగుణంగా పెంచాలని కనీస వేతనాలు అమలు చేయని యాజమాన్యంపై చర్య తీసుకోవాలని, ఎనిమిది గంటల పని దినాన్నే కొనసాగించాలని, ఉద్యోగ భద్రత ,ఉపాధి కార్మిక వర్గానికి కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్స్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ చేయాలని, ఈఎస్ఐపిఎఫ్ తదితర సౌకర్యాలను కల్పించాలని సభ డిమాండ్ చేసింది.

## పురిటి బిడ్డ... రోడ్డు పాలు

**అల్వాల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** పురిటి బిడ్డను పేపర్‌లో చుట్టి రోడ్డు పక్కన పడేసింది ఓ కసాయి తల్లి. రక్తం మరకలుతో ఏడుస్తున్న మగ బిడ్డను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అల్వాల్‌లో చోటు చేసుకున్న ఈ హృదయ విదారకర ఘటన పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూదేవి నగర్ పోచమ్మ ఆలయం సమీపంలో కొద్ది నిమిషాలు ముందు పట్టిన బిడ్డను పేపర్‌లో పొట్లంలా చుట్టి పడేశారు. సమాచారం అందుకున్న పోలీసులు బిడ్డను అక్కున చేర్చుకుని వైద్య పరీక్షలు నిమిత్తం నీలోఫర్ ఆసుపత్రిలో చేర్పించారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే రోడ్డును ఆశ్రయించిన ఆ మహాతల్లి ఆచూకి కోసం పోలీసులు శ్రమిస్తున్నారు. సిసి ఫుటేజీలను జల్లెడ పడుతున్న నేపధ్యంలో సోమవారం తెల్లవారు జాము 4.30 గంటలు సమయంలో ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించారు. దుస్తులు లోపల బయటకి ఎవరికి కనపడకుండా పేపరులో ఏదో వస్తువును చుట్టి నడుచుకుంటూ వెళ్ళడం కనపించింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గాంధీ ఆస్పత్రిలో స్కిల్ ల్యాబ్ ప్రారంభం

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** వైద్య వృత్తిలో పీజీ చేసే విద్యార్థులకు స్కిల్ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అడిషనల్ డీఎంఈ, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రాజ్‌కుమారి అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ సర్జరీ విభాగానికి చెందిన స్కిల్ ల్యాబ్‌ను ఆమే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ల్యాప్రోస్కోపి లాంటి సర్జరీలలో కొత్తగా శిక్షణ తీసుకుంటున్న వారికి కుట్లు వేయడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో డాక్టర్ రాజారామ్, డాక్టర్ కే. ఇందిరా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ ఇతర వైద్యులు పాల్గొన్నారు.



స్కిల్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రాజ్‌కుమారి తదితరులు

**GENERAL PUBLIC NOTICE**

It is to inform that My client's **Smt. MEENA CHOUDHARY** D/o, Late PK CHOUDHARY, aged about 59 years, Occ: Govt Employee and Smt. SUREKHA CHOUDHURY D/o. Late PK CHOUDHURY, aged about 62 years, Occ: Govt Employee, both are R/o. Flat No.303, Vinay Homes, P S Rao Nagar, Dammaiguda, Municipality, Keesara Mandal, MedchalMalkajgiri District., are intending to purchase the property described below from its owner, Smt. YANAMALA MADHAVI, W/o. Y. MADHAVA RAO, aged about 44 years, Occ: House Wife, R/o. H. No. 13-2/141, Silent Avenue, Dammaiguda Village, Keesara Mandal, Medchal-Malkajgiri District.
If anyone has any objection, claim, interest, or dispute related to the intended sale transaction, over the said property they may contact the undersigned with documentary proof substantiating their objections, claims, or details of disputes within seven (14) days from the date of this publication. Failing to do so, my client will proceed to complete the sale transaction with the aforementioned owner, assuming there are no third-party claims, objections, or disputes concerning the Schedule Property. Afterward, no claims, objections, or disputes will be entertained.

**Schedule of Property:**
All that the sell Semifinished House on Plot No. 47 North Part, admeasuring 125.0 Sq.yards., or 104.5 Sq.Meters, In Survey No's. 568 and 569, with a Plinth area of Ground Floor 1050.0 Sft., First Floor 1050.0 Sft., Total 2100.0 Sft., Situated at DAMMAIGUDA H/O NAGARAM Village, Under DAMMAIGUDA MUNICIPALITY, Keesara Mandal, Medchal-Malkajgiri District., and bounded as follows: NORTH - 25' Wide Road, SOUTH - Plot No. 47 South Part, EAST - Plot No. 46, WEST - 25' Wide Road.

**R. NIKHIL SRI HARSHA**
**& Advocates**
#H.No. 11-1/148P, Pranavi Nilayam, Sai Priya Colony, Dammaiguda, Near YashNivas Appt, Kapra, Secunderabad, Telangana-500083
**MOBILE NO. 9705195133**

**IN THE COURT OF HON'BLEXVII SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S.No. 758OF 2024**
Between:
**Gopala Krishna Goyal @ Gopal K Goyal & 4 others ...Plaintiffs**
AND
**1. All concerned& 2 others ...Defendants**

**PUBLIC NOTICE**

The above named plaintiffs have filed suit for declaration to declare them the legal heirs of **Late Smt Roopa Goyal** (Deceased) died on 09-08-2020, she was absolute owner and possessor of half share of southern portion (1/2 share) of the house bearing No.17-1-391/T/213, new Municipal No.17-1-391/T/213/1 on part of plot.no.213, in survey No.137/1, 137/2 and 137/5 admeasuring 173.50 Sq.yards, equivalent to 145.04 Sq.mtrs, situated at Sankeswara Bazaar, Saidabad, Hyderabad and is bounded by NORTH: Northern portion of H.No.17-1-391/T/213, SOUTH: Plot No.212, EAST: part of Plot No.213, WEST: 60" wide road. The said suit is posted on **27-02-2025** for appearance. If any person or persons having any objection or claimover the property may appear through person or with pleader with relevant documents if any before the above said court at **10.30 am on 27-02-2025** or else the matter will be decided based on the material papers in the court records.
// BY ORDER OF THE COURT//
**RAMESH MUDDAM**
**Advocate**
H.No.4-7-170/24, Plot No.24, Sai Padmavathi Colony, Hayathnagar, R.R.District. **Ph: 9948531842**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL. JUNIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI. DISTRICT. AT: L.B. NAGAAR**
**O.S.NO. 70 OF 2025.**
Between:
**Gangapuram Srinivasa Rao and 3 others ...Plaintiffs**
AND
**The M.R.O Medipally Mandal**
**All Concerned .....Defendants.**
To,
**All Concern,**
Whereas the Plaintiffs herein filed above Legal Heir O.S, for declaring Plaintiffs as Legal Heirs of the Deceased **G. KAMALA,** in respect of Suit Schedule property Plot No.27, admeasuring 200 Sq.yards, equivalent to 167.20 Sq.Mts, open land in Sy No. 62/1, 62/2, 65/1, 65/2 and 65/3, situated in Miyapur Village, (Previously Boduppal Gram Panchayath, Ghatkesar Mandal R.R. District) now comes under Medially revenue Mandal, Medchal - Malkajgiri District. Bounded by North: P.28 South: P.No.26 East: 30 Feet Road and West: P.No.30
You all concerned, hereby take notice and appear in person or by pleader on **17-03-2025 at 10.30 Am.** before the Hon'ble Court, with your objections and documents, if any. Take notice that in default of your appearance, the petition will be heard and determined in your absence.
//By Order Of The Court//
**K. Sri Rama Murthy,** B.Com.LLB
Gudala Krishnamurthy Complex, Raghavendra Nagar Colony, Phase-II, Hayathnagar, Hyderabad

## సమాజానికి తమ వంతు సేవలు : జగిని శ్రీనివాస్



పేద జంటలకు ఉచిత వివాహాన్ని జరిపిస్తున్న జగిని శ్రీనివాస్, నాగ మల్ల అనిల్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** సమాజానికి తమ వంతు సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని జగిని ఫర్నిచర్స్ నిర్వాహకులు జగిని శ్రీనివాస్, నాగ మల్ల అనిల్ కుమార్ లు పేర్కొన్నారు. మలక్ పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ ఎస్ బి హెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో జగిని ఫర్నిచర్స్ నిర్వహకులు జగిని శ్రీనివాస్, నాగమల్ల అనిల్ కుమార్ ల ఆధ్వర్యంలో రెండు పేద జంటలు శృతి శివకుమార్, నవనీత ప్రవీణ్ లకు ఉచితంగా వివాహాలను జరిపించారు వధూవరులకు పెళ్లికి అవసరమైన వస్తువులతో పాటు పుస్తెలు మట్టెలు, ఫంక్షన్ హాల్ అందజేయడంతో పాటు అతిథులందరికీ భోజనం ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జగనే శ్రీనివాస్ మాట్లాడుతూ పేద కుటుంబాలు తమ పిల్లలకు వివాహాలు జరిపించలేని స్థితిలో ఉంటే మా ఫౌండేషన్ ద్వారా వారి వివాహ ఖర్చులు అన్నిటిని భరించి ఉచితంగా వివాహాలను జరిపిస్తామని పేర్కొన్నారు ఇది మాకు భగవంతుడు ఇచ్చిన వరమని పేద జంటలను ఒక్కడిగా చేయడం మాకు చాలా గర్వకారణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, ఎడవల్లి బాలరాజ్, జగిని విజయ్, వెంకటప్రసాద్, లింగేశ్వర్ గుప్తా, కుంచెం నరసింహారావు, కొండా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ**



ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ని శాలువాతో సన్మానించి భారత రాజ్యాంగం పుస్తకాన్ని అందజేస్తున్న డైరెక్టర్ మహమ్మద్ షకీల్ తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్ ఆధ్వర్యంలో మలక్ పేట నుంచి నాయకులు, కార్యకర్తలు కలిసి షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహంగీర్, నిజాం, మూసా ,ఇమ్రాన్, అన్వర్, హర్షద్, ఫహీం, మున్నా, ఫైసల్, మార్బుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత : డాక్టర్ జయస్వామి



డాక్టర్ జయ స్వామిని సన్మానిస్తున్న చౌకి రవికుమార్ బాబు శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఆధ్యాత్మి భావనలతో మానసిక ప్రశాంతత చేకూర్తుందని బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ జయ స్వామి పేర్కొన్నారు. మలక్పేట్ లోని శ్రీ పోచమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ సభ్యులుగా నియమితులను డాక్టర్ జయ స్వామి ని చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్ తదితరులు పుష్పగుచ్ఛల అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజు, రాజారావు గౌడ్,రామకృష్ణ, మదన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్ ఫిర్యాదు



**మల్కాజిగిరి ఫిబ్రవరి17,ప్రభాతవార్త :** జి.హెచ్.ఎం.సి సర్కిల్, జోనల్, ప్రధాన కార్యాలయాలలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ పలు ఫిర్యాదులు చేసారు.ఈ సందర్భంగా వాజపేయ్ నగరలోని వాజపేయ్ విగ్రహం వద్ద సుందరీకరణ పనులు చెప్పట్టాలని స్థానికులు శ్రవణ్ అధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.అదే విధంగా టౌన్ ప్లానింగ్ లో బిల్డింగ్ పెర్మిషన్స్ ఇవ్వడానికి అధికారులు ఇబ్బంది పెడుతున్నారని, పాత ఇళ్లు కూల గోడితే గాని ఇళ్ల పెర్మిషన్స్ ఎందుకు ఇవ్వరని, పర్మిషన్ వచ్చిన తర్వాత కూల గోడతామని అండర్ టేకింగ్ తీసుకొని ఇవ్వాలని కోరారు.అదే విధంగా ప్రభుత్వ స్థలాలను జియో టాగ్గింగ్ చెయ్యాలని కోరారు.సఫిలగూడ పాండ్ పనులకు నిధులు మంజూరు చెయ్యాలని కోరారు.ఓల్డ్ మల్కాజిగిరి లో బస్తీ దావఖానా కట్టాలని కోరారు.ఈ కార్యక్రమం లో రవి, నందు యాదవ్, శ్రీశైలం, బాలనర్సింహ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఎంపి ఈటల రాజేందర్ పరామర్శ



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డిలను పరామర్శిస్తున్న ఎంపి ఈటల రాజేందర్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డిలను సోమవారం మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పరామర్శించారు. బండారి వెంకటరెడ్డి సతీమణి బండారి పద్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపి ఈటల రాజేందర్ సోమవారం వారి ఇంటికి చేరుకుని లక్ష్మారెడ్డి సోదరులను పరామర్శించారు. బండారి పద్మ మృతి బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



మొక్కలు నాటుతున్న అరవింద్ రెడ్డి.



బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న తీగల విక్రంరెడ్డి, అర్కల కామేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సునీత, విజయలక్ష్మి తదితరులు



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న లోకసాని తదితరులు



భారీ కేకు కట్ చేసి సంబరాలు నిర్వహిస్తున్న రామిడి రాంరెడ్డి, సూర్ణగంటి అర్జున్ తదితరులు



చిలుకానగర్‌లో మాజీ సిఎం కెసిఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు



విద్యార్థులకు పరీక్షా ప్యాడులు అందజేస్తున్న అరవింద్‌శర్మ



మాజీ సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న చిలుకానగర్ బిఆర్ఎస్ నేతలు

**పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో...**

**వనస్థలిపురం. ఫిబ్రవరి.17.ప్రభాతవార్త :** బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో వైదేహినగర్ నార్త్ పార్క్ లో చెట్లు నాటడం జరిగింది.అనంతరం స్వీట్లు పంచి సంబరాలు చేసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో అనిల్ చౌదరీ, ముద్దగౌని సుమన్ గౌడ్, సామ బుచ్చి రెడ్డి,గడ్డం మల్లేష్ గౌడ్,ముద్దగౌని సతీష్ గౌడ్, గంగం శివశంకర్,నక్క వెంకట్ స్వామి, ముప్ప సతీష్ చౌదరీ,గొరిశెట్టి మనోజ్,సండడి సందీప్ రెడ్డి,దయాకర్ ముదిరాజ్, కాజా శ్రీనివాస్, యంజాల బిక్షపతి,తిరుమలేష్, నరేందర్ గౌడ్,రషీద్,గిలిలీజు మధు, కొట్టం శివ యాదవ్, కొంగర నరేష్, పారంద శ్రీకాంత్,నిర్మలా దేవి, వర్ధని , వాణి, వైదేహినగర్ నార్త్ అధ్యక్షులు పోగుల రాంబాబు, శిరీదీ నగర్ గౌరవ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి,సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, గాంధీనగర్ అధ్యక్షులు మల్లా రెడ్డి, వెంకటేశ్వరా కాలనీ అధ్యక్షులు కృష్ణ, వివేకానంద నగర్ కాలనీ అధ్యక్షులు వెంకటా చలం, మారుతినగర్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, గాయత్రి నగర్ ఫేస్ 2 అధ్యక్షులు రాజు గౌడ్, పాపిరెడ్డి కాలనీ అధ్యక్షులు శ్రీశైలం, గౌతమినగర్ సెక్రటరీ బోళ్ల శ్రీకాంత్, సౌభాగ్య నగర్ అధ్యక్షులు రామాంజనేయులు, సాగర్ కాంప్లెక్స్ మాజీ అధ్యక్షులు శంకర్ రావు మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

**సరూర్ నగర్ చౌడిలో...**

**హుడాకాంప్లెక్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గం బి.ఆర్.ఎస్ పార్టీ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో సరూర్ నగర్ చౌడి దగ్గర కేక్ కటింగ్ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా చౌడి వద్ద వున్న వృద్ధాశ్రమం లోని పెద్దలకు పండ్లను పంపిణి చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో పుట్టం విజయ్ , కొండ గిరిగౌడ్ , గౌని శ్రీనివాస్ గౌడ్ , ప్రత్యుష్, సోషల్ మీడియా కన్వీనర్ పుత్తుపల్లి శ్రీనివాస్, సాదిక్, కదారి రాజు యాదవ్ , ఫయాజ్ ,గుండె నాగరాజ్ ,యాదగిరి, సాలమ్మ ,రజాక్ ,రమేష్ , సాజిద్, రాజశేఖర్ ,గుఫ్రాన్ ,భాగ్య లక్ష్మీ , సుధ ,టైగర్ సాయి, జహంగీర్ , జగదీశ్ ,మల్లేష్ , శివ ముదిరాజ్ ,అఫ్రోజ్ పాల్గొన్నారు.

**చిలుకానగర్ చౌరస్తాలో**

**ఉప్పల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** మాజీ సిఎం కెసిఆర్ దేశానికి ఆదర్శంగా నిలుస్తారని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మాజీ సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా చిలుకానగర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. సిఎం కెసిఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బజారు జగన్‌గౌడ్, ఏదుల కొండల్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి కె.జగన్, అబ్బుబాయ్, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..**

బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చిలుకానగర్ డివిజన్‌లో పిట్టల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు నెర్థం భాస్కర్ గౌడ్, జెల్లి మోహన్, పల్లె నర్సింగ్‌రావు, గుడి మధుసూధన్‌రెడ్డి, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, కొంపల్లి రవీందర్, వి.బి. నరసింహ, మాస శేఖర్, ఆకిటి బాల్‌రెడ్డి, ఎడ్ల పరమేష్, కొంపల్లి రాజ్‌కుమార్, ఎం.కైలాసం, సకినాల ప్రసాద్, తిరుమలేష్, యాదగిరి, పోచయ్య, రాములు, సదానంద్‌చారి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

**మీర్‌పేట్ కార్పొరేషన్‌లో...**

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ వివేకానంద చౌరస్తా స్వాగత్ గ్రాండ్ సర్కిల్‌లో సోమవారం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కేకు కట్ చేసి బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, మేకల రవీందర్‌రెడ్డి, అనిల్ యాదవ్, దిండు భూపేష్‌గౌడ్, ఎం.ఎ.రజాక్, శ్రీను నాయక్, సునీత, విజయలక్ష్మి, గోపి యాదవ్, సుర్వి లత శేఖర్‌గౌడ్, మాదరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో**

మాజీ ముఖమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలను సోమవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పాత గ్రామ పంచాయతీ బడంగ్‌పేట్ సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి కేకు కట్ చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, ఇఎల్‌వి అశోక్, పుట్టగళ్ళ సంతోష్, రామిడి తూఫాన్‌రెడ్డి, గట్టు మహిపాల్, కొంతం రోహిత్‌రెడ్డి, గాయత్రీ పాల్గొన్నారు.

**అల్మాపురిలో...**

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల దశాబ్దాల నాటి కల నెరవేర్చిన నేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. కెసిఆర్ జన్మదినం సందర్భంగా డివిజన్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్లోని హరిపురి కాలనీలో మొక్కలునాటి, అల్మాపురిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష పాడ్స్ , పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, మరోజు రామచరీ, కొండ్ర శ్రీనివాస్, సాజీద్, వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, రమేష్ కురుమ, మురళీధర్ రెడ్డి, బండారి మల్లేష్, శివ నాయక్, ఊర్మిళా, అనురాధ, యాదమ్మ, బుజ్జి బాయి, పుణ్యవతి, కల్పన, రేవతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## వదిలేసిన డ్రైనేజ్ పైప్‌లైన్‌ను తొర్రూర్ రోడ్డు వరకు వేయాలి



**తుర్కయంజాల్ ఫిబ్రవరి 17,ప్రభాతవార్త :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ లక్ష్మీ నగర్ కాలనీ, మరియు సుందరయ్య కాలనీల దగ్గర వదిలేసిన డ్రైనేజ్ పైప్ లైన్‌ను తొర్రూర్ రోడ్డు వరకు వేయాలిని సోమవారం తుర్కయంజాల్ మున్సిపల్ డి ఈ కి సిపిఎం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ... కమ్మగూడ మస్కత్ డైరీ ప్రగతి నగర్, రాజ్ రంజిత్ కాలనీ, టీచర్స్ కాలనీ ,సాయి ప్రియ కాలనీ ,వెంకటేశ్వర కాలనీ, చుట్టుపక్కల ఉన్న ఇంకా అనేక కాలనీలా డ్రైనేజ్ వాటర్‌ను తీసుకొచ్చి వీకర్ సెక్షన్ కాలనీలైన లక్ష్మీ నగర్ కాలనీ, సుందరయ్య నగర్ కాలనీ, దగ్గర డ్రైనేజీని వదిలివేయడం జరిగింది. దీనివలన దోమలు పందులు డ్రైనేజ్ దుర్వాసనతో అక్కడున్న కాలనీ వాసులు అనేకమంది రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుందరయ్య కాలనీకి అనుకొని ఉన్న హెచ్ఎండిఏ ఫారెస్ట్ ఉండడంవల్ల ఆ డ్రైనేజీ వాటర్ ను అక్కడ వదిలేయడం జరుగుతుంది. ఈ యొక్క పైప్ లైన్ సైదు పెంచి తొర్రూర్ చెరువు వరకు పొడిగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పైప్ లైన్ ను పొడిగించాలని అధికారులను కోరారు. డ్రైనేజీ పైపులైన్లు పొడిగించని యెడల పై కాలనీల ప్రజలను సమీకరించి భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మున్సిపల్ కార్యదర్శి డి కిషన్, మున్సిపల్ కమిటీ సభ్యులు సత్యనారాయణ ఇల్లూరి భాస్కర్, సుందరయ్య నగర్ సిపిఎం శాఖ కార్యదర్శులు పోడేండ్ల శ్రీనివాసులు, ఐతరాజు, కృష్ణ, మెతుకుల నరసింహ, సాయి, కే సత్యం , శంకర్ ,పాల్గొన్నారు

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో కెసిఆర్ బర్త్ డే ఫ్లెక్సీల తొలగింపు

-బిఆర్ఎస్ ఆగ్రహం.. కమిషనర్‌ను కలిసి అసహనం వ్యక్తం చేసిన నేతలు



బడంగ్‌పేట్ కమీషనర్‌ను కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్య కర్తలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఉద్యమ సారథి కెసిఆర్ పుట్టిన రోజు సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ పాత గ్రామ పంచాయతీ సర్కిల్‌లో బిఆర్ఎస్ నేతలు ఏర్పాటు చేసిన కెసిఆర్ ఫ్లెక్సీలను బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వారు తొలగించడంపై బిఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. పుట్టిన రోజు వేడుకలను నిర్వహించే నిమిత్తం స్థానిక చౌరస్తాలో కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే సోమవారం కార్పొరేషన్ సిబ్బంది వాటిని తొలగించడంలో నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్‌ల ఆధ్వర్యంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్పొరేషన్ కార్యాలయానికి తరలివెళ్ళి కమీషనర్ పి.సరస్వతిని కలిసి నిరసన వ్యక్తం చేశారు. కెసిఆర్ పుట్టిన రోజు సందర్భంగా తాము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పుట్టిన రోజు వేడుకల కార్యక్రమం జరుగక ముందే తొలగించడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. గతంలో ఎవరెవరివో పుట్టిన రోజుల సందర్భంగా ఏర్పాటైన ఫ్లెక్సీలను తొలగించని కార్పొరేషన్ కెసిఆర్ ఫ్లెక్సీలను ఎలా తొలగిస్తారని వారు నిలదీశారు. అయితే బిఆర్ఎస్ నేతల వాదనలకు స్పందించిన కమీషనర్ భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనాచారి, నాయకులు భీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, టేకుల భాస్కర్‌రెడ్డి, పుట్టగళ్ళ సంతోష్, పెద్దబావి అంజిరెడ్డి, జూకంటి సురేష్‌గౌడ్, ఇఎల్‌వి అశోక్, గౌరసాయికుమార్, గాయిత్రిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



నీరంకి రవికి నియామక పత్రం అందజేస్తున్న పవన్‌కుమార్, నరసింహగుప్తా

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** అభివృద్ధి విషయంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు భాగస్వాములు కావాలని కొత్తపేట చైతన్యపురి డివిజన్ల కార్పొరేటర్లు నాయికోటి పవన్ కుమార్, రంగ నరసింహ గుప్తా పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ న్యూమారుతినగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో కార్పొరేటర్లు ముఖ్య అతిథులుగా హాజరై కాలనీ నూతన అధ్యక్షుడు నిరంకి రవికి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ సంక్షేమం, అభివృద్ధి దిశగా నూతన కమిటీ సభ్యులు ముందుకు తీసుకెళ్తారని సూచించారు. కార్పొరేటర్లుగా కాలనీ అభివృద్ధికి మా వంతు కృషి చేస్తామని, అసోసియేషన్ సభ్యులకు కాలనీ వాసులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూ మారుతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు నిరంకి రవి, సెక్రటరీ ప్రభాకర్, ట్రెసరర్ శ్రీనివాస్ కృష్ణ, ఉపాధ్యక్షులు గంధం రవి కేశవ్, మురళి క్రిష్ణ, మహేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు ఆంజనేయులు, ఆనంద కుమార్, శంకర్, అరుణ్ కుమార్, పద్మ, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులను స్మరించుకోవాలి

**-మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



అంబేద్కర్, పూలే, బిజెఆర్ విగ్రహాలను ఆవిష్కరించిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయులను స్మరించుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 39వ డివిజన్ జిల్లెలగూడలో మాజీ కార్పొరేటర్ మాదరి సురేఖ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత రత్న అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావు పూలే, జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం హర్షణీయమనీ వారి సేవలను గుర్తు చేసుకుంటూ వారిని ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుంచుకునే విధంగా చేయడం సంతోషకరమని అన్నారు. మహనీయుల కలలను, ఆశయాలను సాకారం చేయడానికి అందరూ కృషి చేయాలనీ అప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, అర్కల కామేష్‌రెడ్డి, ఎనుగుల అనిల్ యాదవ్, గజ్జెల రాంచందర్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, మాదరి శ్రీనివాస్, గంగమ్మ, గీత, నిర్మల పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



**వనస్థలిపురం. ఫిబ్రవరి.17.ప్రభాతవార్త.** హస్తినాపురం శ్రీ రమణ కాలనీ ఫేస్ వన్ లో రోడ్ నెంబర్ 3లో గత కొంతకాలంగా డ్రైనేజ్ సమస్య తో సతమతమవుతున్న కాలనీవాసులకు ఉపశమనం కలిగిస్తూ సోమవారం హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ సుమారు పది లక్షల 50 వేల హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్ వారి నిధులతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తొందరలోనే శ్రీ రమణ కాలనీ ఫేస్ 1 కూ ఓపెన్ జిమ్ మంజూరు చేస్తున్నట్లు తర్వాతే ఎక్కడైతే సీసీ రోడ్ అవసరం ఉందో వాటికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు

## నిరుపేద మహిళలకు బిఆర్ఎస్ నేతల చేయూత

**ఉప్పల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పిల్లి నాగరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద మహిళలకు చీరలు, పేద కుటంబానికి పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా పేదలకు తమ వంతు చేయూత అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజలకు సేవ చేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఉప్పల్ డివిజన్‌లో మొదటిసారి బిఆర్ఎస్ పార్టీ జెండాను అవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మంచికంటి రాజవర్ధన్‌గుప్త, పంగ రాజేశ్వర్‌రెడ్డి, గౌరిగె ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి



జిల్లా వైద్యాధికారి డా.ఉమాగౌరిని సత్కరిస్తున్న ఉప్పల్ ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర సిబ్బంది దృశ్యం.

**ఉప్పల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యాధికారి డా. ఉమాగౌరి సందర్శించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.శౌలిస్యరాణి, సూపర్‌వైజర్ బోగ ప్రకాష్ తదితరులు జిల్లా వైద్యాధికారి ఉమా గౌరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.ఉమాగౌరి మాట్లాడుతూ ఉప్పల్ ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దాసరి ప్రసాద్

**హయత్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా దాసరి ప్రసాద్ ఎన్ని కయ్యారు. రావినారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా మహాసభలో ఆయన రెండోసారి ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. సంఘం రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షులుగా చెందివెంకట్, జిల్లా సహాయ కార్యదర్శిగా మందుల కృష్ణలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమపై నమ్మకంతో ఎన్నుకున్న నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నమ్మకాన్ని వమ్ముచేయకుండా కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషిచే స్తామన్నారు. తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్దితో నెర వేరుస్తామని, సంఘం బలోపేతానికి కృషిచేస్తామన్నారు. జిల్లా లోని కార్మికుల అడ్డాలలో మౌళిక వసతుల కల్పనకు ఉద్యమి స్తామని, కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు సంక్షే మ బోర్డునుంచి కార్మికులకు ఇన్సురెన్సు చేయిస్తామన్నారు. సీపీ ఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌రెడ్డిలు వారిని శాలువాతో సత్క రించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సక్రునాయక్, అరుణ, సుశీల, యమున, అలివేణి, జ్యోతి పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఏవి రావు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** కాలనీవాసులు ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకొని తాము ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సుప్రజ ఆసుపత్రి డిజీఎం ఏవి రావు విజ్ఞప్తి చేశారు. నాగోల్ సుప్రజా ఆసుపత్రి వారి సౌజన్యంతోకమలానగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కమలానగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు పలు సలహాలు సూచనలను అందజేశారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీలిమ, కార్తికేయన్, సౌందర్య, మనీషా, దివ్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## మన ఆలోచన ఒరియంటేషన్ క్లాస్‌లకు స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న కటకం నర్సింగ్‌రావు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** మన ఆలోచన వ్యవస్థాపకుడు కటకం నర్సింగ్ రావు ఆధ్వర్యంలో వివిధ కులాల ముఖ్య సభ్యులతొ నిర్వహించిన ఒరియంటేషన్ క్లాస్ లకు మంచి స్పందన లభించింది. బీసీలు రాజ్యాధికారం సాధించాలని అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించాలనే లక్ష్యంతో పది రోజులపాటు నిర్వహించిన కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని నర్సింగ్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ ధర్మబిక్షం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల విషయం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గడ్డం నరసింహ, దింత ఆనందం, తడక యాదగి రి, గుండ్ల ఆంజనేయులు గౌడ్, పూస నరసింహ గంగపుత్ర, ఎనబోలు శ్రీనివాస్ ముదిరాజ్, బచనబోయిన శ్రీనివాస్ యాదవ్, వడ్డేపల్లి దశరథ, ఏలే పురెంధర్, బాలరాజు నాయి, దుర్గయ్య గౌడ్, ఐయిలి వెంకన్న గౌడ్, వేముల కొండల్ గౌడ్, కె.వి గౌడ్, చీమల శ్రీనివాస్ యాదవ్, బొంగు వెంకటేష్ గౌడ్, నరహరి చారి, పెద్దఉరబ్రమయ్య రజక, శంకర్, కైరంకొండ నర్సింగ్ పాల్గొన్నారు.

## గృహిణి ఆత్మహత్యాయత్నం

**హయత్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** భర్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందన్న మానసిక క్షోభతో గృహిణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... బి.ఎన్.రెడ్డినగర్ వినాయకహిల్స్‌కు చెందిన చైత్రం మహేష్, శ్వేత(19)లకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి 11 నెలల కుమారుడు ఉన్నాడు. భర్త్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని మానసికంగా కృంగిపోయిన శ్వేత ఈనెల 17న ఆటోబుక్ చేసుకుని కుంట్లూర్ సమీపంలోని నిర్మానుష ప్రాంతానికి వెళ్లి థమ స్ప్‌లో లైజాల్, డోమిక్స్, ఎలకల మందు కలిపి తాగింది. దీన్ని గమనించిన చుట్టు పక్కల వారు 100కు డయల్‌చేయగా... హయత్‌నగర్ పెట్రోల్ వెహికిల్ సిబ్బంది రాజేందర్‌రెడ్డి, నరేందర్ నాయక్‌లు ఆమెను హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ఆమెకు చికిత్స చేసి ప్రాణాపాయం లేదని చెప్పారు.